ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
17-01-2025
శుక్రవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 125 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి




## అమెరికాలో సంపన్నుల ఆధిపత్యం పెరుగుతోంది

- యావత్తు ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా మారుతోంది
- మన ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛకు భంగం కలుగుతోంది
- అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆందోళన

**జయభేరి, న్యూయార్క్ జనవరి 16:**

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఫేర్‌వెల్ ప్రసంగం చేశారు. అమెరికాలో సంపన్నుల ఆధిపత్యం పెరుగుతోందని వార్నింగ్ ఇచ్చారు. అది ప్రమాదకరంగా మారుతోందన్నారు. దశాబ్ధాల రాజకీయ కెరీర్‌కు స్వస్తి పలుకుతూ.. బైడెన్ మీడియాతో మాట్లాడారు. అత్యంత సంపన్నమైన, శక్తివంతమైన, ప్రభావంతమైన వ్యక్తుల చేతుల్లో అధికారం ఉన్నదని,

2 లో



## అంతరిక్షంలోకి స్పేడెక్స్ డాకింగ్, ప్రయోగం!

- ఇస్రో చరిత్రలో మరో ఘనత

**జయభేరి, హైదరాబాద్, జనవరి 16 :**

గత కొన్నేళ్లుగా అంతరి క్షంలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థఇస్రో.. సంచలన విజయాలతో దూసుకెళ్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా 2025 ఏడాదిలో తొలి విజయాన్ని అందుకుంది. గతేడాది చివర్లో నింగిలోకి పంపించిన స్పెడెక్స్ ప్రయో గానికి సంబంధించి డాకింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసింది.

2 లో



# ఢిల్లీలో రేవంత్ బిజీ బిజీ

**జయభేరి, ఢిల్లీ:**

తెలంగాణలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు అటవీ, పర్యావరణ శాఖ వెంటనే అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ కి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని ఇందిరా పర్యావరణ్ భవన్‌లో ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌ని కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను నివేదించారు. కేంద్ర అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో తెలంగాణ వ్యాప్తంగా 161 ప్రాజెక్టులు నిలిచిపోయాయని వివరించారు. 38 ప్రాజెక్టులకు వన్యప్రాణి సంరక్షణ చట్టాల పరమైన అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ ప్రాజెక్టుల్లో అత్యధికం రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలు, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నాయని కేంద్ర మంత్రికి తెలియజేశారు. అనుమతులు రాకపోవడంతో జాతీయ రహదారులు, ఏజెన్సీ ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం, పీఎంజీఎస్‌వై, పొరుగు రాష్ట్రాలను అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతుల మంజూరు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

కాలుష్యాన్ని నియంత్రించాలన్న లక్ష్యంలో భాగంగా హైదరాబాద్ మహానగరంలో వంద శాతం బస్సులను ఎలక్ట్రిక్ మోడల్‌లోకి మార్చేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రికుమారస్వామి కి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కుమారస్వామి ని వారి కార్యాలయంలో కలిసి ఈ విషయంపై చర్చించారు. పీఎం ఈడ్రైవ్ పథకం కింద జీసీసీ పద్ధతిలో తెలంగాణకు బస్సులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన విషయాన్ని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కి గుర్తుచేశారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులకు ఎలక్ట్రిక్ కిట్ అమర్చి రెట్రో ఫిట్మెంట్ పద్ధతిలో ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు అవకాశం ఉన్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. హైదరాబాద్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించే 2,800 బస్సులను జీసీసీతో పాటు రెట్రో ఫిట్మెంట్ మోడల్ కింద కేటాయించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

## కేటీఆర్ ఈడీ విచారణ

- కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత



**జయభేరి, హైదరాబాద్, జనవరి 16:**

ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఈడీ గురువారం విచారిస్తోంది. గచ్చిబౌలిలోని నివాసం నుంచి బయలుదేరిన కేటీఆర్ నేరుగా ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ముందు పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. దాదాపు 200 మంది సిబ్బంది మోహరించగా.. బాష్పవాయువు, వాటర్ కెనాన్లను అందుబాటులో ఉంటారు. కేటీఆర్ విచారణకు హాజరయ్యే సమయంలోనే భారీ సంఖ్యలో ఆ పార్టీ కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. దీంతో వారిని

...మిగతాది 2 లో

## నేడు సీఎం చంద్రబాబు కేబినెట్ సమావేశం




**జయభేరి, అమరావతి, జనవరి16:**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రేపు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం సమావేశం నిర్వహించనుంది, నేడు ఉదయం 11 గంటలకు సచివాలయంలో కేబినెట్ సమావేశం జరగనుంది... ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకో నున్నట్టుగా తెలుస్తోంది. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలుతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమా లకు సంబంధించి చర్చించే అవకాశం ఉంది.. ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటనపై కూడా ఏపీ కేబినెట్ లో చర్చిస్తారు. తెలంగాణ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్ట్ పై అభ్యం తరాలు వ్యక్తం చేసిన విషయం విదితమే కాగా.. ఎజెండా తర్వాత ఈ అంశంపై కూడా కేబినెట్ లో చర్చ జరిగే అవకాశం ఉందంటున్నారు. సచివాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న కేబినెట్ సమావేశంలో.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా హామీల అమలుపై చర్చించే అవకాశం ఉంది. ఇక, పలు కంపెనీలకు భూములు కేటాయింపుకు ఆమోద ముద్ర వేసే ఛాన్స్ ఉంది.. మద్యం దుకాణాల్లో గీత కార్మికులకు 10 శాతం కేటాయింపు అంశంపై చర్చించి ఓ నిర్ణయానికి రాబోతున్నారు. గీతకార్మికులకు ఇచ్చే షాపులకు సంబంధించి కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది.. మరోవైపు.. కేబినెట్ భేటీ అనంతరం.. మంత్రులతో తాజా రాజకీయ పరిణా మాలు, ఇతర అంశాలపై కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్చించే అవకాశం ఉంది.

## హిండెన్ బర్గ్ మూసివేత

- ఫౌండర్ సంచలన ప్రకటన




**జయభేరి, న్యూ ఢిల్లీ, జనవరి 16:**

యూఎస్‌కు చెందిన షార్ట్ సెల్లర్ సంస్థ, అదానీ గ్రూప్‌తో సహా పలు వ్యాపార సంస్థలను లక్ష్యంగా చేసుకున్న హిండెన్ బర్గ్‌ను మూసివేస్తున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపకుడు నేట్ ఆండర్సన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఓ లేఖను రిలీజ్ చేశారు. అయితే హిండెన్ బర్గ్ మూసివేతకు ఎలాంటి ముఖ్యమైన కారణాలేమీ లేవని,

...మిగతాది 2 లో



## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి

- కువైట్ లో చిక్కుకున్న మహిళకు సాయం

**జయభేరి, అమరావతి:**

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు ఏజెంట్ చేతిలో మోసపోయి కువైట్ లో చిక్కుకున్న మహిళను రక్షించి క్షేమంగా స్వస్థలానికి చేర్చారు.

...మిగతాది 2 లో

## తెలంగాణ నుంచి రాహుల్ పాదయాత్ర



**జయభేరి, హైదరాబాద్, జనవరి 16:**

తెలంగాణలో ఓవైపు పాలన మరో వైపు పార్టీ బలోపేతం దృష్టిపెట్టిన కాంగ్రెస్ పార్టీ ఆ దిశగా వేగం పెంచింది. నెలాఖరుకు పెండింగ్ నామినేటెడ్ పోస్టుల భర్తీతో పాటు, పీసీసీ నూతన కార్యవర్గం ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. ఫిబ్రవరిలో కాంగ్రెస్

...మిగతాది 2 లో

## ఆధ్యాత్మిక వేడుకలలో రికార్డులు

2 లో

జనరల్ న్యూస్
jayabheridaily.com
ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## కేటీఆర్ ఈడీ విచారణ

పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకోగా.. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మరోవైపు, కేటీఆర్ విచారణ నేపథ్యంలో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వెళ్లే రహదారిపై ఇరువైపులా పోలీసులు భారీగా మోహరించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీభవన్ వద్ద కూడా భారీగా బందోబస్తు చేపట్టారు.కాగా, దర్యాప్తులో భాగంగా ఇప్పటికే ఇదే కేసులో నిందితులుగా ఉన్న అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. గురువారం కేటీఆర్‌ను ఈడీ విచారిస్తోంది. హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపైనా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. సంస్థకు రూ.45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఏసీబీ నుంచి వివరాలు తెప్పించుకున్న ఈడీ మరింత లోతుగా విచారిస్తున్నట్లు సమాచారం.ఒప్పందాల్లో కీలకంగా వ్యవహరించిన వ్యక్తులు ఎవరు. ఫెమా నిబంధనలను ఉల్లఘించి విదేశీ కంపెనీకి నిధులు ఎంత పంపారు. ఎలా పంపారు. అవి చివరికి ఎవరి ఖాతాలో పడ్డాయి. ఇందులో కేటీఆర్‌తోపాటు అధికారు పాత్ర ఎంత. ఏ ఉద్దేశంతో ఈ వ్యవహారం నడచింది. అన్న వివరాలను ఈడీ తెలుసుకునే అవకాశం ఉంది. ఆ తర్వాతే ఈడీ కేటీఆర్‌పైకేసు పట్టే అవకాశాలను పరిశీలించనుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.ఈ కేసులో ఇప్పటికే అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈడీ అధికారులు విచారిస్తున్నారు. మరోవైపు, ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. ఈ నిర్ణయాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 'డిస్మిస్డ్ యాజ్ విత్‌డ్రాన్'గా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అటు, రాజకీయ వేధింపుల్లో భాగంగానే ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని కేటీఆర్ ట్విట్టర్ వేదికగా విమర్శించారు. కాంగ్రెస్ పెడుతున్న కేసులు తమ ఘనతను తుడిచేయలేవని అన్నారు.

**'రాజకీయ వేధింపులే'**

ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారానికి సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఉదయం ఈడీ విచారణకు హాజరయ్యారు. గచ్చిబౌలిలోని ఆయన నివాసం నుంచి బయలుదేరి నేరుగా ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలోనే బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ముందు భారీ బందోబస్తు చేపట్టారు. దాదాపు 200 మంది పోలీసులు అక్కడ మోహరించారు. అటు, ఈడీ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకుంది. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఫార్ములా ఈ రేస్‌లో వ్యవహారానికి సంబంధించి ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా.. ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిధుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసింది. ఇదే కేసులో ఇప్పటికే అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. ఈ నిర్ణయాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 'డిస్మిస్డ్ యాజ్ విత్‌డ్రాన్'గా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. విదేశీ సంస్థకు రూ.45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈడీ అధికారులు విచారిస్తున్నారు. కాగా, ఈడీ విచారణకు హాజరయ్యే ముందు ట్విట్టర్ వేదికగా కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కేసులు ఘనతను తుడిచేయలేవని అన్నారు. 'హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ అనేది మంత్రిగా తాను తీసుకున్న నిర్ణయాల్లో ఒకటి. ఆనాడు రేసర్లు అంతా హైదరాబాద్ నగరాన్ని కీర్తించారు. హైదరాబాద్ నగర బ్రాండ్ నాకు ముఖ్యం. పారదర్శకంగా రూ.46 కోట్లు బ్యాంక్ టు బ్యాంక్ విధానంలో చెల్లించిన తర్వాత అవినీతి ఎక్కడిది..? మనీ లాండరింగ్ ఎక్కడిది..?. ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు. ప్రతి పైసాకి లెక్క ఉంది. ఫార్ములా ఈ రేస్ రద్దు వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగింది. ఎలాంటి అవినీతి జరగకున్నా కేసులు, కోర్టులంటూ రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారు. కచ్చితంగా ఈ అంశంలో నిజమే గెలుస్తుంది. తప్పు లేకపోయినా ఏదో కాలం వెల్లదీసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. త్వరలోనే తప్పకుండా నిజం తెలుస్తుంది.' అని కేటీఆర్ పేర్కొన్నారు.

## అంతరిక్షంలోకి స్పేడెక్స్ డాకింగ్

ఈ స్పేస్ డాకింగ్ ప్రక్రియ సక్సెస్ అయినట్లు స్వయంగా ఇస్రో.. ట్విటర్‌లో వెల్లడించింది. ఇక అంతరిక్షంలో శాటిలైట్ల ను అనుసంధానం చేయడం చాలా క్లిష్టమైన పని కాగా.. ఇప్పటివరకు ప్రపంచంలో మూడు దేశాలు మాత్రమే.. ఈ ఘనతను సాధించాయి. తాజాగా ఇస్రో చేపట్టిన స్పేస్ డాకింగ్ పూర్తి కావడంతో ఇప్పుడు ఆ జాబితాలో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. ఇది ఒక చరిత్రాత్మక క్షణం అని ఇస్రో పేర్కొంది. 15 మీటర్ల నుంచి 3 మీటర్ల హోల్డ్ పాయింట్ వరకు ఈ డాకింగ్ పూర్తి అయినట్లు ప్రకటించింది. అత్యంత ఖచ్చితత్వంతో డాకింగ్ ప్రక్రియను ప్రారంభించగా.. అది విజయవంతంగా అనుసంధానం అయిందని పేర్కొంది. ఈ స్పేస్ డాకింగ్ ప్రక్రియ విజయవంతం కావడంతో.. ప్రపంచంలోనే ఇలాంటి స్పేస్ డాకింగ్ చేసిన నాలుగో దేశంగా భారత్ అవతరించినట్లు ఇస్రో వెల్లడించింది. భారత్ కంటే ముందు చైనా, రష్యా, అమెరికా దేశాలు స్పేస్ డాకింగ్‌లో విజయ వంతం అయ్యాయి. ఈ సందర్భంగా ఈ ప్రక్రియలో పాల్గొన్న ఇస్రో టీమ్‌కు, దేశానికి ఇస్రో శుభాకాంక్షలు తెలిపింది.

## రాహుల్ పాదయాత్ర

అగ్రనేత రాహుల్ గాంధీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం ద్వారా పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపేందుకు ప్లాన్ చేసింది.మరో పాదయాత్రకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేపట్టనున్నారు. “సేవ్ కాన్‌స్టిట్యూషన్ పాదయాత్ర” (సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర) తెలంగాణ నుంచి ఈ యాత్ర ప్రారంభించేలా చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఢిల్లీలో ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌ను కలిశారు. గణతంత్ర దినోత్సవం నాడు ప్రారంభం కానున్న ఈ పాదయాత్రకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశవ్యాప్త ప్రచారంలో భాగంగా వచ్చే నెల మొదటి పక్షం రోజుల పాటు ర్యాలీని ప్లాన్ చేశారు.రాజ్యాంగ విలువలను కాపాడవలసిన అవసరాన్ని లక్ష్యంగా పెట్టుకుని AICC నేతృత్వంలో ఈ పాదయాత్ర సాగనుంది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అగౌరవపరిచారంటూ ఈ యాత్ర ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. జనవరి 8న గాంధీభవన్‌లో జరిగిన పిఏసి సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగాన్ని పరిరక్షించడంపై దృష్టిసారించిన పిఏసి ఏడాది పొడవునా నిరసన కార్యక్రమాన్ని కొనసాగించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ర్యాలీలో నిర్వహించ తలపెట్టిన ర్యాలీలో ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొనాలని కోరింది.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కీలక సమావేశం జరిగింది.సీఎం రేవంత్ సహా రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలతో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసంలో కీలక భేటీ జరిగింది. రేవంత్ రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సుమారు గంటన్నరపాటు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో చర్చించారు. తెలంగాణ ర్యాలీకి సంబంధించిన వివరాలను ఖరారు చేయాలని కోరింది. అనంతరం మీడియాతో మాట్లాడిన మహేష్‌కుమార్ గౌడ్ ఖమ్మం లేదా సూర్యాపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని, అక్కడ రాహుల్ గాంధీ కీలక ప్రసంగం చేయాలని కోరినట్లు తెలిపారు. నెలాఖరులోగా ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రభుత్వ సంస్థల్లో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని మహేష్ గౌడ్ తెలిపారు. అయితే, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణపై వ్యాఖ్యానించడానికి నిరాకరించిన ఆయన, తుది నిర్ణయం పార్టీ హైకమాండ్, ముఖ్యమంత్రిదేనని పేర్కొన్నారు. టీపీసీసీ నూతన కార్యవర్గం ఏర్పాటుపైనా సమావేశంలో చర్చించారు. ప్రజల్లో చురుగ్గా పని చేసే నాయకులకే డీసీసీ అధ్యక్ష పదవులు వచ్చేలా చూస్తామన్నారు.



# ఆధ్యాత్మిక వేడుకలో రికార్డులు

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా సంరంభం మొదలైంది. జనవరి 13న పౌర్ణమినాడు మొదలైన కుంభమేళా ఫిబ్రవరి 26న శివరాత్రితో ముగుస్తుంది. 45 రోజుల పాటు మినీ భారతాన్ని తలపించే విధంగా సాగే ఈ మహా కుంభమేళా కోసం పవిత్ర త్రివేణీ సంగమమైన ప్రయాగ్‌రాజ్ భక్త జన సందోహంతో కిటకిటలాడనుంది. దాదాపు 40 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి తరిస్తారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తోంది. దేశ జనాభాలో ప్రతి నలుగురిలో ఒకరు వస్తారన్న మాట. వీరే కాకుండా విదేశాలలోని ప్రవాస భారతీయులు, విదేశీయులు కూడా పెద్దసంఖ్యలో ఇప్పటికే ప్రయాగ్ రాజ్‌కు చేరుకున్నారు. ఈ మహా ఉత్సవం కోసం ఏడాది ముందునుంచే ఏర్పాట్లు మొదలయ్యాయి. రూ.12,700 కోట్ల బడ్జెట్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ ఏర్పాట్లు చేశాయి. పవిత్ర స్నానాలు ఆచరించడం కోసం వచ్చే లక్షలాది భక్తుల కోసం త్రివేణీ సంగమం వద్ద ఓ తాత్కాలిక మహా నగరమే ఏర్పాటయిందని చెప్పవచ్చు.దాదాపు పదివేల ఎకరాల్లో లక్షన్నర రెస్ట్ రూమ్‌లు, వేలాది వాష్‌రూమ్‌లు, అంబులెన్స్‌లు, వందలాది పడకలతో తాత్కాలిక ఆస్పత్రులు ఏర్పాటు చేశారు. లక్షల సంఖ్యలో ప్రత్యేక బస్సులు, వేలాది ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. ఒక్క రైళ్ల ద్వారానే దాదాపు రెండు కోట్ల మంది వస్తారని రైల్వే శాఖ అంచనా. ఇక ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారి కోసం 5 లక్షల కార్ల పార్కింగ్‌కు సౌకర్యాలు కల్పించారు.కాలుష్య నివారణ కోసం పెద్ద సంఖ్యలో విద్యుత్ వాహనాల వినియోగం, అతిపెద్ద నదీ శుద్ధి కార్యక్రమం, వేల సంఖ్యలో పారిశుద్ధి కార్మికులు.. ఇలా ఎన్నెన్నో సదుపాయాలను కల్పించారు. మిగతా కుంభమేళాలకు భిన్నంగా 144 ఏళ్ల తర్వాత జరగనున్న ఈ మహా కుంభమేళాకు ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ఆధ్యాత్మికతతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మిళితం చేసి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం విశేషం. వేల సంఖ్యలో సీసీ కెమెరాలు, నీటి అడుగునుంచే పర్యవేక్షించే నిఘా కెమెరాలు, పడవలపైనుంచి నిఘా లాంటి ఎన్నెన్నో ఆధునిక సాంకేతికతో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర పోలీసులతో పాటుగా వేల సంఖ్యలో పారా మిలిటరీ బలగాల సేవలను ఉపయోగించుకోనున్నారు. అందుబాటులో ఉన్న అన్ని సేవలను ఉపయోగించుకోవడం ద్వారా భక్తులకు మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి.కుంభమేళాకు ప్రత్యేక ఆకర్షణ లక్షల సంఖ్యలో తరలివచ్చే సాధువులేనని చెప్పవచ్చు. హిమాలయాల్లో ఉండే నాగసాధువులతో పాటు వివిధ అఖారాలనుంచి లక్షల సంఖ్యలో సాధువులు ఈ మహా కుంభమేళాకు తరలి రానున్నారు. నాగసాధువులను దర్శించుకొని వారి ఆశీర్వాదాలు తీసుకోవడానికి భక్తులు ఎగబడతారు. మరోవైపు ఇన్ని కోట్లమంది భక్తులకు ఆహార, వసతుల కోసం వివిధ మఠాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా తమ శక్తివంచన లేకుండా ఏర్పాట్లు చేశాయి.అవసరమైన సమాచారాన్ని అందించడానికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌తో పాటుగా వందల సంఖ్యలో సమాచార కేంద్రాలు సిద్ధం చేసింది. రోజుకు కోటిమంది భక్తులు వచ్చినా ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చూడడానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఉత్సవాల ప్రారంభం సందర్భంగా యూపీ సీఎం యోగిఆదిత్యనాథ్ చెప్పడం గమనార్హం. ఇక తొలి రోజే కోటికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు చెప్తున్నారు.మకర సంక్రాంతినాడు తొలి రాజస్నానం మొదలు కాగా , మహా శివరాత్రినాటి రాజస్నానంతో మేళా ముగుస్తుంది. మహా కుంభం మొదటి రెండు రోజుల్లో 5.15 కోట్ల మంది స్నానాలు చేయడం కూడా ఒక రికార్డేనట. తొలిరోజు మహాకుంభంలో 1.65 కోట్ల మంది స్నానాలు చేయగా, మకర సంక్రాంతి రోజున 3.50 కోట్ల మంది స్నానాలు చేశారట. హింస జరగలేదు... కులం, మతం, పౌరసత్వం గురించి ఎవరినీ అడగలేదు... ఎవరినీ కించపరచలేదు.. మరే ఇతర మతాన్ని కూడా చిన్నచూపు చూడలేదు. ప్రపంచం నలుమూలల నుంచి ఎందరో ధనవంతులు, స్వదేశీ, విదేశాల నుంచి అన్ని రకాల భక్తులు... ఎంతో భక్తిపూర్వంగా వచ్చి.. తమ తమ భక్తి శ్రద్ధలను ఆచరించి తరించి పరమానంద భరితులయ్యారో. ఇన్ని కోట్ల మందికి ఆహారం, నీరు తదితరాల ఏర్పాటు ఉంది... ప్రయాగ్‌రాజ్‌లో వసతి కూడా ఉంది... భక్తులకు ఇది పూర్తిగా ఉచితం... ఇలాంటి ఉదాహరణ ప్రపంచంలో ఎక్కడా మనకూ కనిపించదు... ఈ ప్రయాగ్‌రాజ్ మహాకుంభం అతీంద్రియమైనది... మరపురానిది... ఊహకందనిది.... ఇది కేవలం భారత్ లో మాత్రమే సాధ్యమవుతున్నది... ఇంత చిన్న నగరంలో ఇందరు భక్తులు రాక పోకలు సాగించడమా? ఇది కలయా నిజమా? అన్న మీమాంశను వదిలి ప్రయాగ్ రాజ్ వెళ్లండి.. 144 ఏళ్ల తర్వాత జరుగుతోన్న మహాకుంభమేళాను ఆస్వాదించి.. ఆ గంగామాయి ఆశీస్సులు పొందండి.. ముక్కోటి దేవతల ఆశీర్వచనాలు అందుకోండంటూ పిలుస్తోంది ఉత్తర ప్రదేశ్.... మహాకుంభమేళా సందర్భంగా దాదాపు 2 లక్షల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుందని అంచనా. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన ఆధ్యాత్మిక పండుగగా భావించే ఈ మహాకుంభమేళాలో స్నానమాచరిస్తే ఆత్మశుద్ధిని పొందడమే కాకుండా భగవంతుడికి చేరువవుతారన్నది హిందువుల బలమైన విశ్వాసం. అందుకే ఈ ఆధ్యాత్మిక జనసంద్రం.

## మాట నిలబెట్టుకున్న మంత్రి

జీవనోపాధి కోసం తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం గ్రామానికి చెందిన వరగంటి సుగుణ కువైట్ వెళ్లారు. అయితే అక్కడకు వెళ్లిన తర్వాత అనేక ఇబ్బందులు పడుతున్నానని, ఏజెంట్ మోసం చేశారని ఎక్స్ వేదికగా ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర అనారోగ్యం బారినపడిన తాను తిండిలేక అల్లాడుతున్నానని, ఎలాగైనా రక్షించి స్వస్థలానికి చేర్చాలని వీడియో ద్వారా మంత్రి నారా లోకేష్‌ను విజ్ఞప్తి చేశారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి లోకేష్.. తన టీం ద్వారా వరగంటి సుగుణను క్షేమంగా రాష్ట్రానికి తీసుకువచ్చి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. సాయం అడిగిన వెంటనే స్పందించి అండగా నిలిచిన మంత్రి నారా లోకేష్‌కు సుగుణ, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## హిండెన్ బర్గ్ మూసివేత

వ్యక్తిగత అంశాలు, భయాలు బెదిరింపులు కూడా లేవని స్పష్టం చేశారు. ఇదే సమయంలో హిండెన్‌బర్గ్ తన జీవితంలో ఎప్పుడూ అతి పెద్ద ప్రధాన విషయం కాలేదనీ, కానీ దీన్ని ఒక అధ్యాయంగా చూస్తున్నానన్నారు. ఈ విషయాన్ని హిండెన్ బర్గ్ రీసెర్చ్ తన అధికారిక వెబ్ సైట్ ధృవీకరించింది. కాగా, అదానీ గ్రూప్‌పై సంచలన ఆరోపణలతో ఆ మధ్య భారత స్టాక్ మార్కెట్లను హిండెన్‌బర్గ్ వణికించింది.సంస్థను మూసేస్తున్నట్లు సంచలన ప్రకటన చేసిన ఆండర్సన్.. లేఖలో సుదీర్ఘమైన వివరాలు ప్రస్తావించారు. తాను హిండెన్‌బర్గ్ రీసెర్చ్ రద్దు చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. తాము పని చేస్తున్న ఆలోచనలకు సంబంధించిన ప్రక్రియ పూర్తైన తర్వాత ముగించాలనేది ప్లాన్ అని ఆయన హిండెన్‌బర్గ్ వెబ్‌సైట్‌లోని ఒక నోట్‌లో తెలిపారు. అయితే ఎందుకు మూసివేస్తున్నామనే విషయంపై మాత్రం ఆయన కారణాలు వెల్లడించలేదు. "ఇప్పుడు ఎందుకు రద్దు చేయాలి? అనే ప్రశ్నకు ఒక నిర్దిష్ట కారణం ఏమీ లేదు. హిండెన్ బర్గ్ మూసివేత వెనుక ఎలాంటి ప్రత్యేకమైన ముప్పు లేదు. ఆరోగ్య సమస్య గానీ, వ్యక్తిగత సమస్యలు, భయాలు గానీ లేవు" అని అండర్సన్ అన్నారు. తన జీవితంలో జరిగిన చాలా విషయాల్లో ఇది ఒకటని, కానీ అన్నింటి కంటే ఇదే అతిపెద్ద విషయమని ఆండర్సన్ చెప్పారు. తాను ఇప్పుడు హిండెన్‌బర్గ్‌ని తన జీవితంలో ఓ అధ్యాయంగా చూస్తున్నట్లు తెలిపారు. తనను నిర్వచించే ప్రధాన విషయంగా కాదని వెల్లడించారు. అయితే హిండెన్ బర్గ్‌ను ఎప్పుడు మూసివేస్తామనే విషయంపై మాత్రం ఎలాంటి తేదీని ప్రకటించలేదు. ప్రస్తుతం ఈ సంస్థ నిర్వహిస్తున్న ప్రాజెక్టులు పూర్తి చేసిన తర్వాతే మూసివేయాలనేది తమ ప్రణాళికగా ఉందని నేట్ ఆండర్సన్ పేర్కొన్నారు. సంస్థ ప్రారంభంలో తాను ఎదుర్కొన్న సవాళ్లను సైతం ఆండర్సన్ ప్రస్తావించారు. తన కుటుంబ సభ్యులెవరికీ ఈ రంగంలో అనుభవం లేదన్నారు. "నేను ప్రభుత్వ పాఠశాలలో చదివాను. నేను స్లిమ్ సేల్స్ పర్సన్‌ని కాదు. నాకు వేసుకోవడానికి సరైన బట్టలు కూడా లేవు. నేను గోల్ఫ్ ఆడలేను. నేను 4 గంటల నిద్రలో పనిచేయగల సూపర్ హ్యూమన్‌ని కాదు. నేను ఈ సంస్థను ప్రారంభించినప్పుడు నా వద్ద తగినంత డబ్బు కూడా లేదు. 3 కేసులను పట్టుకున్న తర్వాత కూడా నా వద్దకు అంత త్వరగా డబ్బు రాలేదు" అని చెప్పారు. తన వద్ద ఎలాంటి ఆర్థిక వనరులు లేకపోయినా కేసులను ముందుకు తీసుకెళ్లిన ప్రపంచ స్థాయి విజిల్ బ్లోయర్ లాయర్ బ్రయాన్ వుడ్ మద్దతు లేకపోతే తాను ఆరంభంలోనే విఫలమయ్యేవాడినని చెప్పుకొచ్చేవారు. తనకు ఓ నవజాత శిశువు ఉందని, బహిష్కరణను ఎదుర్కోవడంతో తాను చాలా భయపడ్డానని, కానీ తనకున్న ఏకైక మార్గం ముందుకు సాగడమనేనన్నారు.ఇటీవలి కాలంలోనే భారత్‌లో హిండెన్ బర్గ్ ఎక్కువగా ప్రచారంలోకి వస్తోంది. ముఖ్యంగా ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ సంస్థ అదానీ గ్రూప్‌పై షార్ట్ సెల్లింగ్ చేసి వార్తల్లో నిలిచింది. 2023 జనవరిలో తన నివేదికలో అదానీ గ్రూప్ షేర్ ధరలను తారుమారు చేసిందని ఆరోపిస్తూ చేసిన రిపోర్ట్స్ ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేపాయి. దీంతో కంపెనీ షేరు విలువ గణనీయంగా పడిపోయి దాదాపు 140 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ తుడిచిపెట్టుకుపోయింది. ఈ వివాదం పార్లమెంటులోనూ తీవ్ర దుమారం రేపగా.. ఉద్దేశపూర్వకంగా కొన్ని వాస్తవాలను వక్రీకరించారని ఆరోపిస్తూ షార్ట్ సెల్లర్‌కు సెబీ నోటీసులు జారీ చేసింది. అయితే కేవలం అదానీ గ్రూప్‌నే కాకుండా.. పలు సంస్థలపైనా ఎన్నో ఆర్థిక పరిశోధనలు చేసి, ఆరోపణలు చేసింది. దీంతో ఆయా కంపెనీల షేర్లు అమాంతం పాతాళానికి పడిపోయాయి. ఈ ప్రక్రియకు హిండెన్ బర్గ్ ఆర్థిక రంగంలో మానవ నిర్మిత కృత్రిమ విపత్తుల్ని గుర్తించడం అని పేరు పెట్టుకుంది.

## అమెరికాలో సంపన్నుల ఆధిపత్యం

ఇది యావత్తు ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా మారుతోందని, మన ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛకు భంగం కలుగుతోందని బైడెన్ ఆందోళన వ్యక్తం చేశారు. 82 ఏళ్ల బైడెన్ శ్వేతసౌధం నుంచి చివరి టీవీ ప్రసంగం చేశారు. వాతావరణ మార్పులు, సోషల్ మీడియా దుష్ప్రచారంపై వార్నింగ్ ఇచ్చారు.తన సింగిల్ టర్మ్ పాలనలో సాధించిన ఘనతల గురించి ఆయన వివరించారు. ఉద్యోగాల కల్పన, మౌళిక సదుపాయాలపై ఖర్చు, ఆరోగ్య పరిరక్షణ, కోవిడ్ నుంచి బయటపడడం, మళ్లీ దేశాన్ని నెంబర్ వన్ స్థానంలో ఎలా నిలిపారన్న అంశాలను ఆయన తన ప్రసంగంలో చెప్పారు. తాము చేసిన పని ఫలితాలు అందాలంటే ఇంకా సమయం పడుతుందన్నారు. మేం విత్తనాలు నాటామని, అవి పెరుగుతాయని, కొన్ని దశాబ్దాల పాటు ఆ పుష్పాలు వికసిస్తాయన్నారు.అమెరికా ప్రజలపై సమాచార దాడి జరుగుతోందని, తప్పుడు సమాచారం ప్రచారం ఎక్కువగా ఉందని, దీంతో అధికార దుర్వినియోగం జరుగుతోందన్నారు. మెటా లాంటి సోషల్ మీడియా కంపెనీలను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. సోషల్ మీడియాలో ఫ్యాక్ట్ చెకింగ్ జరగడం లేదన్నారు. అబద్ధాలతో నిజాన్ని కప్పిపుచ్చుతున్నారన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సాధనలో జైపాల్ రెడ్డి పాత్ర కీలకం



**జయభేరి, న్యూ ఢిల్లీ, జనవరి 16:** ప్రత్యేక తెలంగాణ కల సాకారంలో కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి పాత్ర చిరస్మరణీయమని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ఇవాళ దివంగత కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి 83వ జయంతి. ఈ సందర్భంగా ఉత్తమ పార్లమెంటేరియన్ సూదిని జైపాల్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని గురువారం ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో సాధారణ పల్లె నుంచి ఢిల్లీ దాకా సాగిన ఆయన ప్రస్థానంలో నైతిక విలువలకు కట్టుబడి ఉన్నారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో, పార్లమెంట్ ఉభయ సభల్లో బలమైన గళం వినిపించారని సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, బెల్లంపల్లి, పరిగి ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాయకులు రోహిన్ రెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.సూదిని జైపాల్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, మాడుగులలో జన్మించారు. 18 నెలల వయస్సులోనే పోలియో వ్యాధి కారణంగా వైకల్యానికి గురయ్యారు. జైపాల్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎమ్ఏ పట్టా పొందాడు. నీతి, నిజాయితీ ఆయన సొంతం. అవినీతి మరక అంటని గొప్ప నాయకుడు. అందుకే రాజకీయాల్లో అలుపెరగని యోధుడిగా ఆయన ప్రస్థానం కొనసాగింది. పార్టీలకు అతీతంగా నేతలతో చనువు పెంచుకున్న, ప్రేమను పంచుకున్న మహా గొప్ప లీడర్ జైపాల్ రెడ్డి అంటే అతిశయోక్తి కాదేమో. కాంగ్రెస్ పార్టీతో పొలిటికల్ కెరీర్ ప్రారంభించిన జైపాల్ రెడ్డి.. ఎమర్జెన్సీ సమయంలో కొన్ని కారణాలతో ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి జనతా పార్టీలో చేరారు.జైపాల్ రెడ్డి 1969 నుంచి 1984 వరకు నాలుగు సార్లు ఆంధ్రప్రదేశ్ శాసన సభకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అయిన జైపాల్ రెడ్డి.. అత్యవసర పరిస్థితిని వ్యతిరేకించి తర్వాత బీజేపీ చేరారు. ఆయన పార్లమెంట్‌కు మొదటిసారిగా 1984లో మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. తర్వాత కాంగ్రెస్ అభ్యర్థిగా 1999, 2004లో మిర్యాల గూడ నియోజకవర్గం నుంచి రెండు సార్లు పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. రాజ్యసభ సభ్యునిగా 1999, 1996లో ఎన్నికయ్యారు. 199192లో రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా కూడా వ్యవహరించారు. రెండు సార్లు సమాచార, ప్రసార శాఖా మంత్రిగా పని చేశారు. 1998లో అత్యుత్తమ పార్లమెంటేరియన్ పురస్కారం కూడా అందుకున్నారు.

# వర్గల్ లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

- కాంగ్రెస్ హయాంలో.. పేదల సంక్షేమానికి పెద్దపీట
- డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



**జయభేరి, వర్గల్, జనవరి 16 :**

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వర్గల్ మండల కేంద్రంలో రూ 25 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, మాజీ జెడ్పిటిసి ప్రభుదాస్ గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణతో కలిసి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారంటీలు అమలు చేస్తుండగా, త్వరలోనే అర్హులైన పేదలందరికీ ఇంటి నిర్మాణాలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్నదాతను ఆర్థికంగా ప్రోత్సహిస్తుండగా, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు నేరుగా కొనుగోలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కిందని తెలిపారు. రూ 2 లక్షల పంట రుణమాఫీని ఏకకాలంలో వర్తింపజేసి రైతులను రుణ విముక్తి చేసిన సీఎం రేవంత్ రెడ్డికి రుణపడి ఉండాలని కోరారు.

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ 500 కే వంట గ్యాస్ సిలిండర్ పంపిణీ, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరా, రూ 5 లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం వంటి సాహసోపేత నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుకెళ్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, నాయకులు గజ్వేల్ ప్రవీణ్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాల్ రెడ్డి, మహేందర్ గౌడ్, కిషన్ గౌడ్, గణేష్, ఎల్లారావు, రమేష్ ముదిరాజ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



## కుట్టు మిషన్ లు పంపిణీ చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే

**జయభేరి, కాప్రా :**

చర్లపల్లి డివిజన్ పరిధిలోని పారిశ్రామిక ఏరియాలో రోటరీ క్లబ్ కంపెనీ లో ప్రముఖ పారిశ్రామిక వేత్త బబ్బురి బాలరాజు గౌడ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా 20 మంది మహిళలకు కుట్టు మిషన్ లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ వారికి అభినందనలు తెలిపారు. మహిళకు ఎంతగానో ఉపయోగపడుతోంది అని ఆయన అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠధామంల అభివృద్ధి



**జయభేరి, ఘట్కేసర్ :**

పోచారం మున్సిపల్ పరిధిలోని పోచారం వైకుంఠధామంలో పారిశుధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. గురువారం పోచారం మున్సిపల్ పరిధిలోని పోచారం వైకుంఠధామంలో పారిశుధ్య పనులను పరిశీలించరు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. జెసిబి, డోజర్ సహాయంతో ముళ్ళ పొదలు పిచ్చి మొక్కలను తొలగించడం జారుగుతుందని, అలగే మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ, యంనం పేట్, నరపల్లి లలోనీ వైకుంఠధామాలు అతి త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్, నాయకులు సామల బుచ్చిరెడ్డి, బద్దం జగన్ మోహన్ రెడ్డి, అకిటి బల్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వాలు మారినా ప్రజల కష్టాలు తీరడం లేదు

- కౌన్సిలర్ హంసరాణి

**జయభేరి, మేడ్చల్ :**

క్యాలెండర్లో పేజీలు మారుతున్నా, రోజులు, నెలలు గడుస్తున్నా, ప్రభుత్వం మారినా తెలంగాణ పేద ప్రజల కష్టాలు తీరడం లేదని గుండ్లపోచంపల్లి మున్సిపల్ పట్టణ పరిధిలోని కండ్లకోయ మున్సిపల్ బీజేపీ కౌన్సిలర్ సముద్రాల హంస రాణి కృష్ణా గౌడ్ ఆరోపించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం పేదలకు రేషన్ బియ్యం అందిస్తున్నా అందకుండా అడ్డుపడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డుల పంపిణీ విషయంలో నిర్లక్ష్య ధోరణి పనుల ద్వారా ప్రజలకు తెలుస్తుందని ఆమె చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన పేద ప్రజల నుండి ప్రజాపాలన దరఖాస్తులు తీసుకున్న సమగ్ర సర్వే ద్వారా రేషన్ కార్డులు లేవని వందల సంఖ్యలో పేద ప్రజలు గోడు వినిపించుకున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డును చూసిన తెలంగాణ ప్రజలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు గడుస్తున్న కొత్త రేషన్ కార్డు మోహన్ చూడలేదని కౌన్సిలర్ హంస రాణి స్పష్టం చేశారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పట్టణంలో అర్హులైన పేద ప్రజలు వందల సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటే పదుల సంఖ్యలో రేషన్ కార్డుల సర్వేను నిర్వహించడం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై ఉన్న అశ్రద్ధ పని తీర్పు నిదర్శనమని ఆమె వెల్లడించారు. పిల్లలు జన్మించి 11 సంవత్సరాలు గడుస్తున్న రేషన్ కార్డులో వారి పేరు నమోదు కానటువంటి పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతుందని ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి పట్టిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని బీజేపీ కౌన్సిలర్ హంస రాణి కృష్ణగౌడ్ తెలిపారు.

# అంగరంగ వైభవంగా జరిగే అమ్మవారి జాతర

**జయభేరి, ఘట్కేసర్ :**



ఘట్కేసర్ మున్సిపల్ గ్రామ దేవత అయినా శ్రీ శ్రీ శ్రీ గట్టు మైసమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పనులు పాలరిశీలిస్తున్న ఘట్కేసర్ మున్సిపల్ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్. ఈ సందర్భంగా చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాపుతూ.. ప్రతి సంవత్సరం అంగరంగ వైభవం గా జరిగే శ్రీ శ్రీ శ్రీ గట్టు మైసమ్మ అమ్మవారి జాతర సందర్భంగా దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అవంచానియా సంఘటనలు జరకకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం అని, అదేవిధంగా ఉన్నత అధికారులతో చర్చించి ట్రాఫిక్ కి ఇబంది లేకుండా చూడాలని, పార్కింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలనీ తెలుపడం జరిగింది అని అదేవిధంగా గొడవలు, దొంగతనాలు, చైన్ స్నాచింగ్ లు జరుగా కుండా పోలీస్ అధికారులకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలనీ కోరడం జకరిగింది అని, ప్రజలు కూడా పోలీస్ అధికారులకు, మున్సిపల్ అధికారులకు, ఆలయ అధికారులకు, ప్రతి ఒక్కరు సహకరించి అమ్మవారి దర్శనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు M ముత్యాల్ యాదవ్, ఆలయ ఈఓ భాగ్య లక్ష్మి, కౌన్సిలర్లు బండారు ఆంజనేయులు గౌడ్, కడుపోలా మల్లేష్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్మా, మాజీ డైరెక్టర్ బొక్క జంగారెడ్డి, యూత్ అధ్యక్షుడు బొక్క సంజీవ్ రెడ్డి, పోలీస్ అధికారులు, మున్సిపల్ అధికారులు, ఎండోమెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చీర్యాలలో స్టార్టప్ డే ఉద్యమోత్సవ్

- నేటి సాంకేతిక ఆధారంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధ్యాపకులదే - గిరీష్ కుమార్ బాసిన్




**జయభేరి, జనవరి 16:**

మారుతున్న సాంకేతిక విధానానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధ్యాపకులదే అని ఐఏసి, ఏఐసిటిఈ అసిస్టెంట్ డైరెక్టర్ గిరీష్ కుమార్ బాసిన్ అన్నారు. ఎంఓఈ ఏఐసిటిఈ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇన్వెస్టర్ నెట్ వర్క్ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ జిల్లా చీర్యాల లో గీతాంజలి కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, నేషనల్ స్టార్టప్ డేలో భాగంగా ఉద్యమోత్సవ్ 2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. నేటి ప్రపంచంలో సాంకేతిక విప్లవం కొనసాగుతుందని, అందుకు అనుగుణంగా ప్రతి విద్యార్థిని సారథులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధ్యాపకులదే అన్నారు. ఇక ఈ ఉద్యమోత్సవ్ ముఖ్య ఉద్దేశ్యం పెట్టుబడిదారులు, విద్యార్థుల మధ్య వారధిగా ఉండి అంకుర సంస్థల ఏర్పాటుకు కృషి చేయడమే అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటి హెచ్ డా.మల్లారెడ్డి, డా. సూర్యకుమార్, కళాశాల చైర్మన్ రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ హరిశ్చంద్ర రెడ్డి, డైరెక్టర్ డా. ఉదయ్ కుమార్ సుసర్ల, ప్రిన్సిపల్ డా. కె.సాగర్, డా. నీరజ రాణి, డా. బి. నాగమణి తదితరులు పాల్గొన్నారు.



# మానవత్వం చాటుకున్న ప్రభుత్వ డాక్టర్

**గజ్వేల్, జనవరి 16:**




సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామంలో దర్శనం నాగమణి, కిడ్ని వ్యాధితో బాధపడుతూ కుటుంబాన్ని పోషించలేక గత వారం రోజులు కింద మృతి చెందిన విషయం తెలిసిందే. తండ్రి నరసింహులు మతి స్థిమితం కోల్పోయి ఉన్నారు. వారికి ముగ్గురు పిల్లలు కుటుంబాన్ని పోషించలేక నాగమణి గత 11 రోజుల క్రింద చనిపోయింది. ఆ కుటుంబాన్ని ఆదుకునే వాళ్ళు ఎవరూ లేక కుటుంబం రోడ్డు మీద పడిందని విన్న గజ్వేల్ ప్రభుత్వ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆనంద్, తన కుమార్తె శ్రీజానంద్ పేరు మీద వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు గురువారం రోజున ఒక క్వింటల్ బియ్యము ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ద్వారా సహాయం అందించారు. డాక్టర్ కుమార్తె ఎంబిబిఎస్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నా ప్రస్తుతం డెంగ్యూ ఫీవర్ అనారోగ్యంతో యశోద హాస్పిటల్ హైదరాబాద్ నందు చికిత్స పొందుతున్నారు తొందరగా కోలుకోవాలని భగవంతుని కోరుకుంటూ సహాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆసుపత్రి సిబ్బంది దేవసాని వాసుదేవ్, అంగన్వాడీ టీచర్ బాకీ సంధ్య ఆశా వర్కర్ కమల, దేవసాని హనుమాన్ దాస్, సీనియర్ జర్నలిస్టులు పులి బాలచందర్, బాకి నర్సింహులు, పాల్గొని కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు.



## నేడు విద్యుత్ సరఫరా నిలిపివెతా

**జయభేరి, వర్గల్, జనవరి 16 :**

వర్గల్ మండలంలోని నెంటూర్ గ్రామంలోని సబ్ స్టేషన్ లో కొత్త పవర్ ట్రాన్స్ఫారం మరమ్మతులు చేస్తున్నందున నెంటూర్, జబ్బాపూర్, గోవిందపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

## డివిజన్ కాంగ్రెస్ కమిటీలు త్వరలో..

- డివిజన్ ప్రెసిడెంట్ నగేష్ నాయక్



**జయభేరి, మాదాపూర్ :**

పాత కాంగ్రెస్ పార్టీ కమిటీలు రద్దు అయిన కారణంగా నూతనంగా పార్టీ కమిటీ లు వేసే పనిలో నిమగ్నం అయ్యింది. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకిత భావంతో పని చేసి క్రియాశీలక పాత్ర పోషించే వారిని మాదాపూర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ సభ్యులుగా నియామకం చేస్తామని మాదాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డి. నగేష్ నాయక్ పత్రికముఖంగా తెలియజేశారు. రాబోయే బల్దియా ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ క్యాడర్ సమన్వయం తో పనిచేస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలియ జేశారు.

## మొక్కుబడిగా పథకాల అమలు

- కౌన్సిలర్ అమరం సరస్వతీ



**జయభేరి, మేడ్చల్ :**

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో అమలు విషయంలో దోబూచులాడుతుందని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నాలుగవ వార్డు కౌన్సిలర్ అమరం సరస్వతీ మోహన్ రెడ్డి అన్నారు. గురువారం నాలుగవ వార్డుకు చెందిన 11 మంది లబ్ధిదారులకు మజూరైనట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా అమరం సరస్వతీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కుబడిగా పథకాల అమలు అమాలు చేస్తుందని విమర్శించారు. మున్సిపాలిటీలో రేషన్ కార్డు లేని వారు అనేక మంది సమగ్ర కుటుంబ సర్వేలో దరఖాస్తు చేసుకున్నారని కానీ ప్రభుత్వం తూతుమంత్రంగా పథకాలను అమలు చేస్తూ పదుల సంఖ్యలో మాత్రమే రేషన్ కార్డులను మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. పేదలకు ప్రజా పాలన అందిస్తామని ఆరు గ్యారెంటీ ల పేరుతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే వాటి అమలు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం విడ్డురంగా ఉందన్నారు. రేషన్ కార్డులు లేని వారు వందల్లో పదుల సంఖ్యలో ఇవ్వడం ఏంటని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికి పథకాలు అమలు జరిగే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం

- స్ఫూర్తి అసోసియేషన్ సభ్యులు



**జయభేరి, జనవరి 16:**

శామీర్ పేట మండలం మజీద్ పూర్ గ్రామంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి భిక్షపతి గారి తల్లి తుంకి మల్లమ్మ (90) మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నూతనంగా ఏర్పాటు అయిన స్ఫూర్తి అసోసియేషన్ సభ్యులు అంత్యక్రియల కోసం 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందచేశారు. ఆపదలో ఉన్నవారిని మానవతా దృక్పథంతో ఆదుకోవాలని ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో తుంకి వెంకటేష్, జీడిమెట్ల మల్లేష్, తుంకి వెంకటేష్, తుంకి మల్లేష్, అంతాయిపల్లి నాగేష్, అన్నంగల్ల మహిపాల్, తుంకినరసింహ, తుంకి బాబు, తుంకి కుమారస్వామి, తుంకి వెంకటేష్, తుంకి కుమార్, ఉద్దమరి వెంకటేష్, అంతాయిపల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారులకు అండగా మనం ఫౌండేషన్

జయభేరి, గజ్వేల్, జనవరి 16:

బంగ్లా వెంకటాపూర్ లో తల్లి మరణంతో అనాధలుగా మారిన ముగ్గురు చిన్నారులకు మనం ఫౌండేషన్ తరపున 10వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు.. ఈ కార్యక్రమంలో మనం ఫౌండేషన్ అధ్యక్షులు గొడుగు స్వామి, ప్రధాన కార్యదర్శి కనకయ్య,కోశాధికారి ఆంజనేయులు,సభ్యులు కొండల్ రెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

## అంత్యక్రియలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్



జయభేరి, పరకాల, జనవరి 16:

గురువారం పరకాల మున్సిపల్ పరిధిలోని రాజపేట అంబేద్కర్ సెంటర్ 18వ వార్డులోని ఏకు రవి కుమారుడు ఏకు ప్రశాంత్ నిన్నటి దినమున అనారోగ్యంతో మరణించగా వారి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి వారి అంతక్రియలో పాల్గొన్న పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ, స్థానిక కౌన్సిలర్ ఏకు రాజు, కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, యూత్ నాయకులు మచ్చ సుమన్, ఏకు బొబ్బిలి, మేకల దేవరాజ్, మడికొండ చంగల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## గోవర్ధన్ చారిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండలం వెంకటంపేట గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోవర్ధన్ చారి ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ లోని సాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గోవర్ధన్ చారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## శాలువాలతో సన్మానం

- సిరందాసు కృష్ణయ్య ఇటీవల తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా మాకం చంద్రమౌళి శాలువాలతో సన్మానించినారు



దేవరకొండ :

దేవరకొండ పట్టణానికి చెందిన సిరందాసు కృష్ణయ్య ఇటీవల తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా మాకం చంద్రమౌళి (సీఎం), మునిని అంజన్ కుమార్, వెంకటేష్ శాలువాలతో సన్మానించినారు.

## వాస్తవాలనే నివేదించండి...

- మా మెప్పుకోసం వాస్తవాలను దాచి పెట్టొద్దు
- మంత్రి సీతక్క

జయభేరి, హైదరాబాద్:

అధికారులంతా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని మంత్రి సీతక్క అన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా పని చేయండి. మీ మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోండి. నిబద్ధతతో పనిచేసి శాఖ గౌరవాన్ని నిలబెట్టాలి. శాఖకు వన్నె తెచ్చేలా పనిచేయాలని అన్నారు. శాఖపరంగా వాస్తవాలనే నివేదించండి. మా మెప్పుకోసం వాస్తవాలను దాచి పెట్టొద్దు. అధికారులు, అమాత్యులు వేరు వేరు కాదు. మీరు పొరపాట్లు చేసి మమ్మల్ని ఇబ్బందుల పాలు చేయొద్దు. ఎవరూ తప్పులు చేయొద్దు, జైలు పాలు కావద్దు. మీ కింది ఉద్యోగులతో సంప్రదింపులు జరపండి, వారి సమస్యలను పరిష్కరించండి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. రూ. 300 కోట్ల నరేగా బిల్లులను నిన్న విడుదల చేశాం. మల్టీ పర్పస్ వర్కర్ల వేతన బకాయిలను విడుదల చేశాం. పంచాయతీరాజ్ శాఖ తరహాలోనే ప్రతి విభాగంలో ఉద్యోగ సమస్యలను ఆన్లైన్ లో పరిష్కరించే విధానాన్ని అవలంబించండని అన్నారు.

# గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

- అర్ఎల్ మూర్తి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు
- పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేయాలి



జయభేరి, హన్మకొండ, జనవరి 16:

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అర్ఎల్ మూర్తి అన్నారు. గురువారం నగరంలోని రాంనగర్లో ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మూర్తి హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో ఉంటూ విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు వెంటనే గురుకులాలకు సొంత భవనాలు నిర్మించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 7200 కోట్ల దాకా స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్లో ఉన్నవి అన్నారు. విద్యార్థులు వారు చదివిన కళాశాలలో చదువు అయిపోయిన తర్వాత సర్టిఫికెట్స్ తీసుకుందామంటే అక్కడున్నటువంటి విద్యాసంస్థల యజమానులు స్కాలర్షిప్లు కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తామని విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంనర అవుతున్న కూడా రాష్ట్రానికి విద్య శాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యారంగ సమస్యలను పరిష్కరించి రాష్ట్రానికి విద్యశాఖ మంత్రిని నియమించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, పరిమళ, జిల్లా సహాయ కార్యదర్శి అనూష తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ ప్రవేశ ఎంపిక పరీక్షకు ఏర్పాట్లు పూర్తి




జయభేరి, వర్గల్, జనవరి 16 :

వర్గల్ మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 202526 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ ఎంపిక పరీక్షకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని ప్రిన్సిపల్ శ్రీ దాసి రాజేందర్ తెలియజేశారు. విద్యాలయంలో ఆరో తరగతిలో మొత్తం 80 సీట్లకు గాను ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 6465 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారనీ తెలిపారు.

ఈనెల 18 వ తేదీ శనివారం ఉదయం 11 గంటల నుంచి ఒకటిన్నర గంటల వరకు ప్రవేశ ఎంపిక పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తము 30 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారనీ చెప్పారు. సిద్దిపేట జిల్లాలోని 10 పరీక్షా కేంద్రాలలో 2250 మంది విద్యార్థులు, మెదక్ జిల్లాలోని 8 పరీక్ష కేంద్రాలలో 1589 మంది విద్యార్థులు, సంగారెడ్డి జిల్లాలోని 12 పరీక్ష కేంద్రాలలో 2626 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారన్నారు. విద్యార్థులు నవోదయ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకునే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. ఈనెల 8 వ తేదీ బుదవారం నాడు నవోదయ ప్రవేశ ఎంపిక పరీక్ష నిర్వహణలో విధులు నిర్వహించే 30 మంది పరీక్ష కేంద్రాల పర్యవేక్షకులు, 30 మంది కేంద్ర పరిశీలకులు, ఇతర అధికారులకు మూడు జిల్లాల ప్రధాన కేంద్రాల్లో శిక్షణ ఇవ్వబడింది. ప్రవేశ ఎంపిక పరీక్ష 2025 పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని వర్గల్ నవోదయ ప్రిన్సిపల్ దాసి రాజేందర్ పేర్కొన్నారు. రిజర్వేషన్, ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి తప్పనిసరిగా హాల్ టికెట్ తో హాజరుకావాలని కోరడమైనది. ఈ నవోదయ ప్రవేశ ఎంపిక పరీక్ష ఏర్పాట్లలో సహకరించిన మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట్ జిల్లాల కలెక్టర్లకు, ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులకు ప్రిన్సిపాల్ ధన్యవాదాలు తెలియజేశారు.

# రఘునందన్ రావును కలిసిన నియోజకవర్గ పట్టణ, మండలాల అధ్యక్షులు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దిశా నిర్దేశం చేసిన ఎంపీ రఘునందన్ రావు



జయభేరి, గజ్వేల్, జనవరి 16:


సిద్దిపేట జిల్లా, గజ్వేల్ నియోజకవర్గ పట్టణ, మండలాల బిజెపి నూతన అధ్యక్షులను ఇటీవలే రాష్ట్ర భారతీయ జనతా పార్టీ ప్రకటించడం జరిగింది.

ఈ సందర్భంగా బిజెపి నూతన అధ్యక్షులు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావుని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు అనంతరం నూతన అధ్యక్షులను శాలువాతో సత్కరించిన మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు గారు మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ముందుకు సాగాలని నూతన అధ్యక్షులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్, గజ్వేల్ మండల బిజెపి అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్, కూకునూర్ పల్లి మండల బిజెపి అధ్యక్షులు అనుముల సంపత్ రెడ్డి, కొండపాక మండల బిజెపి అధ్యక్షులు నీల సత్యం ముదిరాజ్, తూఫ్రాన్ పట్టణ బిజెపి అధ్యక్షులు జానకిరామ్ గౌడ్, మనోహరాబాద్ మండల బిజెపి అధ్యక్షులు బక్క వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో రవాణా శాఖ అధికారుల దాడులు

- 16 కేసులు నమోదు..



జయభేరి, హైదరాబాద్ :

ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. వరుస దాడులతో ట్రావెల్స్ బస్సుల యజమానులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. మోటార్ వాహన చట్టాన్ని ఉల్లంఘిస్తున్న బస్సులపై కేసులు నమోదు చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్ వస్తున్న బస్సులపై దృష్టి సారించారు.కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, కన్యాకుమారి, కర్ణాటక, బెంగుళూరు, ఆంధ్రప్రదేశ్, గోవాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు తనిఖీలు చేస్తున్నారు. తెలంగాణ ట్యాక్స్ కట్టని బస్సులపై కొరడా ఝులిపిస్తున్నారు. లగేజీ తరలించే వాహనాలపై సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ఘటనలపై పదహారు కేసులు నమోదు చేసారు.



## ధార్మిక సేవా పురస్కారానికి భానుప్రకాష్ ఎంపిక

- మర్పడగ క్షేత్రంలో 19న అందుకోనున్న పురస్కారం

జయభేరి, గజ్వేల్, జనవరి 16:

ఆధ్యాత్మిక, ధార్మిక, సాహిత్య, సేవా రంగాలలో విశిష్ట సేవలు అందించిన యువ అవధాని, సాహితీవేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు అవుసుల భాను ప్రకాష్ కు శ్రీ విజయదుర్గా ధార్మిక సేవా పురస్కారం ప్రధానం చేయనున్నట్లు శ్రీ విజయదుర్గా మాత చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ చెప్పెల హరినాథశర్మ పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. ఈ నెల 19 వ తేదీన మర్పడగ శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున క్షేత్రంలో నిర్వహించే విజయదుర్గా పీఠాధిపతులు వెదురుపాక గాడ్ జన్మదిన వేడుకల సందర్భంగా ఈ పురస్కారం అందజేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. వృత్తి రీత్యా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లాల్ గడి మలక్ పేట ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా పని చేస్తున్న భాను ప్రకాష్ ఇప్పటివరకు 40కి పైగా అష్టావధానాలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించగా, వ్యక్తిత్వ వికాస నిపుణులుగా యువతను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పద్య, గేయ, వచన కవితా ప్రక్రియలలో 25 కు పైగా వైవిధ్యభరితమైన రచనలు అందించగా, తెలుగు రాష్ట్రాల్లోని పలు సంస్థలు పురస్కారాలతో భాను ప్రకాష్ ను సత్కరించినట్లు గుర్తు చేశారు. సాహిత్య మాధ్యమంగా దేశభక్తి, దైవభక్తిని, సనాతనధర్మం వైభవాన్ని పరివ్యాప్తం చేస్తున్న భాను ప్రకాష్ కృషికి గుర్తింపుగా శ్రీ విజయదుర్గా మాత చారిటబుల్ ట్రస్ట్ పక్షాన ఈ పురస్కారాన్ని అందిస్తుండగా, మెదక్ జిల్లా బూర్గుపల్లి భాను ప్రకాష్ స్వస్థలమని వివరించారు.

## ప్రేమజంట పారిపోయేందుకు సాయం!

- మహిళను వివస్త్రను చేసి జుట్టు కత్తిరించేశారు

జయభేరి, అనంతపురం, జనవరి 16:


ఓ ప్రేమజంట పారిపోయేందుకు సాయం చేసిందని ఆరోపిస్తూ ఓ మహిళ పట్ల బాలిక బంధువులు అమానవీయంగా ప్రవర్తించారు. ఆమెను వివస్త్రను చేసి జుట్టు కత్తిరించారు. ఈ దారుణ ఘటన సత్య సాయి జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనుకొండ మండలంలోని ఓ గ్రామంలో 16 ఏళ్ల బాలిక అదే గ్రామానికి చెందిన ఓ యువకుడితో వారం కిందట వెళ్లిపోయింది. బాలిక తల్లిదండ్రులు ఈ నెల 13న కియా పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు బాలిక ఆచూకీ కనుక్కొని తల్లిదండ్రులకు అప్పగించారు. అయితే, ప్రేమజంటకు సాయం చేసిందనే కోపంతో అదే గ్రామానికి చెందిన ఓ వివాహితపై బాలిక తల్లిదండ్రులు, బంధువులు బుధవారం దాడికి దిగారు. ఆమెను వివస్త్రను చేసి జుట్టు కత్తిరించేశారు. తీవ్ర అవమానంతో వివాహిత ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. స్థానికులు ఆమెను శాంతపరిచి పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆస్పత్రికి వచ్చి బాధితురాలి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు బాలిక తల్లిదండ్రులు, 11 మంది బంధువులపై కేసు నమోదు చేసినట్లు కియా స్టేషన్ ఎస్సై రాజేశ్ వివరించారు.




# తెలుగులో సినిమాలు తగ్గించిన కుందనపు బొమ్మ కళ్యాణి..

కళ్యాణి ప్రియదర్శిని తెలుగులో హలో సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది. ఈ సినిమాలో అక్కినేని యంగ్ హీరో అఖిల్ హీరోగా నటించాడు. ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. కానీ కళ్యాణి నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఈ మూవీ తర్వాత వరుసగా ఆఫర్స్ అందుకుంది ఈ అమ్మడు. హలో సినిమా తర్వాత శర్వానంద్ రణరంగం, తేజ్ చిత్రలహరి సినిమాలతో ప్రేక్షకులను మెప్పించింది. ఇప్పటికే చాలా మంది మలయాళ ముద్దుగుమ్మలు టాలీవుడ్ లో సినిమాలు చేసి రాణించారు.అలంటి వారిలో కళ్యాణి ప్రియదర్శిని ఒకరు. ఈ చిన్నది తన అందంతో, నటనతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. కళ్యాణి ప్రియదర్శిని తెలుగులో హలో సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది. ఈ సినిమాలో అక్కినేని యంగ్ హీరో అఖిల్ హీరోగా నటించాడు. ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. కానీ కళ్యాణి నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఈ మూవీ తర్వాత వరుసగా ఆఫర్స్ అందుకుంది ఈ అమ్మడు. హలో సినిమా తర్వాత శర్వానంద్ రణరంగం, తేజ్ చిత్రలహరి సినిమాలతో ప్రేక్షకులను మెప్పించింది. ఇక ఈ చిన్నది ఇప్పుడు తెలుగులో అంతగా సినిమాలు చేయడం లేదు. మలయాళంలో మాత్రం ఈ భామ వరుసగా సినిమాలు చేస్తోంది. ఇక ఈ చిన్నది గ్లామర్ షోకు దూరంగా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంటుంది. అక్కడ వరుస సినిమాలతో క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. తాజాగా ఈ బ్యూటీ సోషల్ మీడియాలో పంచుకున్న ఫోటోలు వైరల్ అవుతున్నాయి. రెగ్యులర్ గా సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ పిక్స్ షేర్ చేస్తుంది కళ్యాణి. తాజాగా ట్రెడిషనల్ లుక్ లో క్యూట్ గా ఉంది ఈ చిన్నది. ఈ అమ్మడి ఫోటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.





# కేక పెట్టించిన కృతి కర్బందా..

తెలుగులో బోణి అనే సినిమాతో పరిచయం అయ్యింది ఈ అందాల భామ. తొలి సినిమాతో నటిగా మంచి మార్కులను కొట్టేసింది కృతి కర్బందా. తెలుగులో సినిమాలు చేస్తూనే కన్నడ భాషలోనూ అవకాశాలు అందుకుంది. అక్కడ కొన్ని సినిమాలు చేసింది. తెలుగుతో పాటు కన్నడ భాషల్లోనూ సినిమాలు చేస్తూ ఆకట్టుకుంది కృతి కర్బందా . ఇటీవలే బాలీవుడ్ లోనూ సినిమాలు చేసింది. తెలుగుతో పాటు కన్నడ భాషల్లోనూ సినిమాలు చేస్తూ ఆకట్టుకుంది కృతి కర్బందా. ఇటీవలే బాలీవుడ్ లోనూ సినిమాలు చేసింది. ఇక హీరోయిన్ గా పలు సినిమాల్లోనటించి మెప్పించిన ఈ బ్యూటీకి క్రేజీ ఆఫర్స్ దక్కాయి. పవన్ కళ్యాణ్ తీన్ మార్ సినిమాలో నటించింది. చివరిగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన బ్రూస్ లీ సినిమాలో సిస్టర్ పాత్రలో కనిపించింది. ఆతర్వాత బాలీవుడ్ కు చెక్కేసింది. అక్కడ క్రేజీ సినిమాల్లో నటించి మెప్పించింది. అలాగే స్టార్ హీరోల సినిమాల్లోనూ అవకాశాలు అందుకుంది ఈ హాట్ బ్యూటీ. ఇక ఈ వయ్యారి భామ ఇప్పుడు గ్లామర్ డోస్ పెంచేసింది. బాలీవుడ్ దర్శకనిర్మాతల దృష్టిని ఆకర్షించేలా గ్లామరస్ ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకుంటుంది. ఇటీవలే పెళ్లి కూడా చేసుకుంది ఈ అమ్మడు అయినా కూడా అందాల ఆరబోతలో ఎక్కడ తగ్గడంలేదు కృతి కర్బందా.

# లాస్ ఏంజెలిస్‌లో కార్చిచ్చు.. అస్కార్ అవార్డుల వేడుక జరుగుతుందా?

అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌ను అగ్ని కీలలు చుట్టుముట్టాయి. దీని ప్రభావం ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డులపై ప్రభావం చూపుతుందని సోషల్ మీడియాలో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దీనిపై ఆస్కార్ నిర్వాహకులు స్పందించారు. అవార్డుల వేడుకకు సంబంధించి ఒక కీలక ప్రకటన విడుదల చేశారు. అమెరికాలోని లాస్ఏంజెల్స్ తదితర ప్రాంతాల్లో తీవ్రమైన అడవి మంటలు వ్యాపించాయి. ఇందకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. వీటిని చూసిన వారందరూ తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అమెరికా చరిత్రలో ఇప్పటివరకు ఇలాంటి అగ్నిప్రమాదం జరగలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డుల కార్యక్రమం రద్దు అవుతుందని వార్తలు వచ్చాయి. దీనిపై క్లారిటీ వచ్చింది. నిర్ణీత తేదీన ఆస్కార్ అవార్డుల వేడుకలను నిర్వహిస్తామని నిర్వాహకులు స్పష్టం చేశారు. గత 96 సంవత్సరాలుగా ఆస్కార్ అవార్డుల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. హాలీవుడ్ ప్రతిష్టాత్మక అవార్డు ఫంక్షన్లలో ఇదొకటి అని చాలా మందికి తెలుసు. ఇప్పుడు 97వ ఆస్కార్ అవార్డుల కార్యక్రమం జరగనుంది. అయితే అనూహ్యంగా అడవిలో మంటలు చెలరేగడంతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు వార్తలు వచ్చాయి. '96 ఏళ్ల చరిత్రలో ఆస్కార్ అవార్డుల కార్యక్రమాన్ని రద్దు చేయడం ఇదే తొలిసారి' అంటూ పుకార్లు వినిపించాయి. అయితే ఆస్కార్ నిర్వాహకులు ఈ రూమర్లను ఖండించారు.

'ఆస్కార్ అవార్డుల వేడుకతో ఏటా ఎంతో మంది లబ్ధి పొందుతున్నారు. కోవిడ్ విషయంలో కూడా ఇది ఆగలేదు. ఈసారి కూడా అవార్డు కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం' అని నిర్వాహకులు క్లారిటీ ఇచ్చారు. కాగా మార్చి 2న 'ఆస్కార్ అవార్డు' కార్యక్రమం జరుగుతోంది. దేశ, విదేశాలకు చెందిన సినిమాలు ఈసారి రేసులో ఉన్నాయి. ఇలా చాలా విభాగాల్లో అవార్డులు ఇస్తారు. ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ చిత్రం వంటి విభాగాల్లో సినిమాలు ఎంపిక కానున్నాయి. కాగా అమెరికా అడవుల్లో చెలరేగిన మంటలు చాలా నష్టాన్ని కలిగించాయి. అయితే 'హాలీవుడ్' స్టూడియోలో కూడా మంటలు చెలరేగాయని, దాని లోగో కాలిపోయిందని AI వీడియోలు రూపొందించి ప్రచారం చేశారు. అయితే అది నిజం కాదని ఇప్పుడు తెలిసింది. కాగా భారత్ నుంచి 'లపాటా లేడీస్'ని 'ఆస్కార్ అవార్డు'కి పంపారు. అయితే సినిమా ఎంపిక కాలేదు.




Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com